వైసీపీ భటుల పైరవీలు...!



- ఐదేళ్లుగా వైసీపీకి అంటకాగి తిరిగి పోస్టింగ్ కోసం సీఐల పోటీ
- పాణ్యం, కర్నూలు రూరల్, ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్లకు డిమాండ్
- ఆదాయ మార్గాలు చూపుతూ ఎమ్మెల్యేలకు ఎర
- ప్రసన్నం చేసుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు
- భారీగా సొమ్ములు ముట్టజెప్పేందుకూ వెనుకాడని వైనం
- వైసీపీ నాయకులతోనే ఫోన్లు చేయించి బేరసారాలు
- టీడీపీ వచ్చాక కూడా ఇదే పరిస్థితి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లూప్‌లైన్‌లో ఉన్న సీఐలు



కర్నూలు, జూలై 26:
ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వానికి అంటకాగిన సీఐలు ఆదాయం ఉండే స్టేషన్లలో తిరిగి పోస్టింగులు దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పూర్తిగా వైసీపీ నాయకుల చెప్పుచేతుల్లో పని చేసిన వారంతా మళ్లీ తమకు నచ్చిన స్టేషన్ల కోసం పైరవీలు సాగించడం చూసి పలువురు విస్తుపోతున్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైసీపీ నాయకులు చెప్పినట్లు తలాడించారు. ఈ ఐదేళ్లలో సాధారణ ప్రజలు పోలీస్‌స్టేషన్ గడప తొక్కాలంటే భయపడేలా చేశారు. ఒక్క సుధీర్ కుమార్ రెడ్డి పని చేసిన 11 నెలలు మినహాయించి మిగతా కాలమంతా వైసీపీ కనుసన్నల్లోనే పోలీసు అధికారులు మెలిగారు. ప్రభుత్వం మారింది.. టీడీపీ అధికారంలోకి వచ్చింది.. పోలీసు శాఖల రూపురేఖలు మారుతాయి.. సాధారణ ప్రజలకు న్యాయం జరుగుతుందనుకుంటే పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చేలా ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పని చేసిన సీఐలు, ఎస్‌ఐలు మళ్లీ పోస్టింగుల కోసం చేస్తున్న ప్రయత్నాలు చూసి పలువురు నివ్వెరపోతున్నారు. ఇంతకాలం లూప్‌లైన్‌లో ఉండి ప్రభుత్వం మారితే తమకు అవకాశం వస్తుందని భావించిన సీఐలు నిట్టూర్పుతో ఉన్నారు.

పోస్టింగ్ కోసం పోటాపోటీ..


వైసీపీ హయాంలో పని చేసిన సీఐలు ఆ పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించి టీడీపీ నాయకులను ముప్పతిప్పలు పెట్టారు. ఇప్పుడేమో మళ్లీ పోస్టింగ్‌ల కోసం పోటీ పడుతున్నారు. జూన్ 4న ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఈ రెండు నెలల కాలం వారికి చాలా కలిసొచ్చింది. ఫలితాలు వచ్చిన వెంటనే నేతల ముంగిట గద్దల్లా వాలిపోయారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాగైనా పోస్టింగ్ కొట్టేయాలని అడ్డదారులు తొక్కుతున్నారు. తమ స్టేషన్ పరిధిలో ఏయే ఆదాయ మార్గాలు ఉన్నాయో లెక్కలు వేసి చూపుతున్నారు. మట్కా, పేకాట, ఇసుక, అక్రమ రవాణా, నాటుసారా ఇలా ఎన్నో ఆదాయ మార్గాలు ఉన్నాయంటూ వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు ఈయనే బావున్నాడు కదా.. కొత్త వారెందుకులే అనే పరిస్థితికి ఎమ్మెల్యేలను తీసుకువచ్చారు. మాట వినని ఎమ్మెల్యేలకు ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు చేయిస్తున్నారు. ఆ ఎమ్మెల్యే ఎవరి మాట వింటారో, ఆ ఎమ్మెల్యే బంధువు ఎవరో.. వారి దూరపు చుట్టరికం ఎక్కడుందో.. చూసి పైరవీ చేస్తున్నారు. ఇలా ఏ మార్గాన్నీ వదలడం లేదు. దీనికితోడు వైసీపీ నాయకులతో సఖ్యతగాఉన్న టీడీపీ ఎమ్మెల్యేలకు ఫోన్లు కూడా చేయిస్తున్నారు.

విజిలెన్స్‌కు కూడా పోటీ

విజిలెన్స్ విభాగానికి కూడా భారీగా పోటీ ఏర్పడింది. వైసీపీతో అంటకాగిన సీఐలు కొంత మంది ఎలాగూ తమకు టీడీపీ హయాంలో పోస్టింగ్ దక్కదని భావించి ముందే సర్దుకోవడం మొదలు పెట్టారు. లూప్‌లైన్‌లో ఉండడం ఇష్టం లేక.. ప్రధాన విభాగమైన విజిలెన్స్ దారి పట్టారు. ఇప్పటికే పలువురు సీఐలు ఉన్నత విభాగాల్లో ఉన్న అధికారులను ప్రసన్నం చేసుకుని ఆ విభాగానికి వెళ్లేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నాళ్లూ రెండు చేతులా సంపాదించి ఇప్పుడు ఖాళీగా ఉండలేమని భావించి ఆ విభాగానికి వెళ్లేందుకు పోటీ పడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేల సిఫారసు లెటర్లు ఇవ్వకపోతే విజిలెన్స్‌కైనా రెకమెండ్ చేయాలంటూ పోటీ పడుతుంటం విశేషం.

లూప్ లైన్‌లో ఉన్న వారి పరిస్థితి ఏంటో?

ఐదేళ్ల కింద వైసీపీ అధికారంలోకి వచ్చాక.. టీడీపీ హయాంలో పని చేసిన సీఐలను పూర్తిగా పక్కన పెట్టేసింది. రెడ్లు, క్రిస్టియన్లు, ఎస్సీలకే ప్రాధాన్యం ఇచ్చింది. కాపు వర్గానికి చెందిన ఏ ఒక్కరికి కూడా కర్నూలు జిల్లాలో పోస్టింగ్ దక్కలేదు. కమ్మ వర్గానికి ఒకరికో ఇద్దరికో మాత్రమే ఐదేళ్లలో పోస్టింగ్ దక్కడం విశేషం. ఇటీవల కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగంలో ఓ డీఎస్పీ పోస్టు ఖాళీ ఏర్పడింది. ఉన్నత స్థాయి ఐజీ అధికారి ఒకరు ఆ స్థానానికి మంచి డీఎస్పీ పేరును సూచించాలని కోరగా కాపు వర్గానికి చెందిన ఓ డీఎస్పీ పేరు తెలిపారు. ఆయన కాపు కదా... వద్దులేబ్బా... జగన్‌కు తెలిస్తే అంతే సంగతి అంటూ పెదవి విరిచారని, పేరు చెప్పుకోవడానికి ఇష్టపడని ఓ సీఐ తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో టీడీపీలో పని చేసిన పలువురు సీఐలు, ఎస్‌ఐలు ఇప్పటికీ లూప్‌లైన్‌లోనే మగ్గుతున్నారు. సీఐడీ, ఏసీబీ, ఇంటెలిజెన్స్, రైల్వే, ట్రాన్స్‌కో ఆర్టీసీ వంటి విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్క విజిలెన్స్‌లో మాత్రం కొంత పరపతి ఉన్న సీఐలు పోస్టింగులు ఇప్పించుకోగలిగారు. అది కూడా ఇతర జిల్లాల్లో మాత్రమే. ఇప్పుడు వీరంతా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి పోస్టింగ్ దక్కుతుందని ఆశపడ్డారు. అయితే వైసీపీకి అంటకాగిన సీఐలే పోస్టింగ్‌లకు పోటీ పడుతుండటంతో వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి తమకు పోస్టింగులు ఇచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భారీగా సంపాదించుకున్న సీఐలు తిరిగి పోస్టింగులు దక్కించుకునేందుకు రూ.15 నుంచి రూ.20 లక్షల మేర ముట్టజెప్పేందుకు సిద్ధమవుతున్నారంటే వారు ఏ స్థాయిలో సంపాదించారో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి రెండు జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ముడుపులు అడుగుతుండటంతో అంతగా ఇచ్చుకోలేమని లూప్‌లైన్‌లో ఉన్న సీఐలు వెనక్కు తగ్గుతున్నారు. అంతేగాకుండా కర్నూలు జిల్లాలో వైసీపీకి అంటకాగిన సీఐలు, ఎస్‌ఐలు పక్క జిల్లాలకు వెళ్లి తాము టీడీపీకి అనుకూలమని అక్కడ పోస్టింగులు తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించిన వారికే తిరిగి పోస్టింగులు దక్కేలా ఉన్నాయని వీఆర్‌లో ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రైమ్ స్టేషన్లకు భారీ డిమాండ్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. పాణ్యం, కర్నూలు రూరల్, కర్నూలు తాలుకా అర్బన్, బేతంచెర్ల, కోసిగి, కర్నూలు ఫోర్త్ టౌన్, టూటౌన్, మంత్రాలయం, ఉలిందకొండ, నంద్యాల పోలీస్‌స్టేషన్లకు భారీ డిమాండ్ ఉంది. ఒక్క కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సుమారు పది మంది సీఐలు పోటీ పడటం విశేషం. హైవేకు దగ్గరగా ఉన్న పాణ్యం, కర్నూలు రూరల్, ఉలిందకొండ పోలీస్‌స్టేషన్లకు అయితే.. సుమారుగా ఆరుగురు పోటీ పడుతున్నారు. పూర్తిగా పశ్చిమ ప్రాంతం నిరక్షరాస్యత ప్రాంతమైన కోసిగికి కూడా భారీ డిమాండ్ పెరిగింది. ఆ స్టేషన్‌కు అయితే ఎంత మొత్తంలోనైనా సమర్పించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుండటంతో తుంగభద్ర పరివాహక ప్రాంతంలో ఇసుక ద్వారా ఎంతైనా సంపాదించుకోవచ్చని భావించి ఈ పోటీ పెరిగింది.

టీడీపీ నాయకులను చితగ్గొట్టినా..

కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో గత వైసీపీ ఎమ్మెల్యే చెప్పిందే తడవుగా కొంత మంది టీడీపీ నాయకులను డీటీసీకి తీసుకెళ్లి చితగ్గొట్టారు. అయితే.. టీడీపీ నాయకులు దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడంతో వారిని విడిచిపెట్టారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక 'మీరు చెప్పినందుకే కదా వారిని విడిచిపెట్టాను.. మీకు అనుకూలంగా పని చేశాను కదా.. నాకు ఈసారి పోస్టింగ్ ఇవ్వండంటూ' తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయనకు ఆ స్టేషన్ కాకుండా పక్క స్టేషన్ ఇస్తానని హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. అలాగే కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోనే ఓ ఎమ్మెల్యే పరిధిలోని రెండు పోలీస్‌స్టేషన్‌లలో పని చేసి భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన ఓ సీఐ బనగానపల్లె ప్రాంతానికి పోస్టింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే కర్నూలు నగరంలో పని చేసిన ఓ సీఐ ఇటీవల ఓ పుణ్యక్షేత్రం పోస్టింగ్ కోసం వెళ్లి అక్కడ ఓ వివాదంలో చుట్టుకున్నారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ ఫొటోలు ఉన్న ఉంగరం మాయం కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ సీఐ మరోసారి కర్నూలు రూరల్, పాణ్యం సర్కిల్స్‌కు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఇంటెలిజెన్స్ ఆరా



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక సీఐలు, ఎస్‌ఐల పోస్టింగ్‌లపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇంటెలిజెన్స్ వర్గాలకు ఫోన్లు చేసి మరీ సమాచారం సేకరిస్తున్నారు. గతంలో వైసీపీలో పని చేసిన సీఐలు ఎవరూ అందులో రెడ్లు, ఎస్సీ, క్రిస్టియన్లు ఎంత మంది ఉన్నారు.. ప్రస్తుతం వారు ఎక్కడెక్కడ పోస్టింగ్‌లో కోసం ఆరా తీస్తున్నారో పరిశీలిస్తున్నారు. ఎవరైనా ఎమ్మెల్యేల ప్రలోభాలకు గురవుతున్నారా.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉండటంతో వారు ఏమైనా రెడ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారా అనే కోణంలో కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ విషయాలన్ని రాష్ట్ర ఉన్నతాధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు.

అన్ని వర్గాలకు పోస్టింగ్ ఇవ్వాలని హైకమాండ్ ఆదేశం

గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా రెడ్లు, ఎస్సీలు, క్రిస్టియన్లకు ఇలా కొన్ని వర్గాలకు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారికి పోస్టింగ్‌లు ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర హైకమాండ్ ఇప్పటికే ఆదేశించింది. ఒక సబ్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యేలు అన్ని వర్గాలు, కులాలకు చెందిన సీఐలు, ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఉండేలా చూసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంత మంది ఎమ్మెల్యేలు ఆ ప్రాధాన్య క్రమంలో సిఫారసు లెటర్లు ఇస్తున్నట్లు సమాచారం.

డీఐజీపైనే ఆశలు



కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఐజీ కోయ ప్రవీణ్‌పైనే పలువురు సీఐలు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ హయాంలో నిక్కచ్చిగా నిజాయితీగా పని చేసి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ మొత్తం లూప్‌లైన్‌లో ఉన్న సీఐలు తమకు పోస్టింగ్ దక్కేలా చూడాలని డీఐజీని కోరుతున్నారు. పరిపాలన విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే డీఐజీ.. ప్రతిభ కనబరిచే సీఐలకు మాత్రమే పోస్టింగులు ఇస్తారనే ఆశతో వారు ఉన్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తారన్న గుర్తింపు ఉంది. పత్తికొండ సబ్ డివిజన్‌లో పని చేసిన ఓ సీఐ టీడీపీ నాయకులను తన సర్కిల్ మెట్లు ఎక్కే హక్కు లేదని అప్పట్లో హుకుం జారీ చేశారు. వైసీపీకి అంటకాగిన అలాంటి వారికి పోస్టింగులు రాకుండా చూడాలని పోలీస్ శాఖలో చర్చగా మారింది.

కొత్త మద్యం పాలసీ వస్తుంది కదా అని..



కొత్త మద్యం పాలసీ వస్తుండటంతో మద్యం షాపులకు టెండర్లు పిలుస్తారు... ఒక్క మండల స్థాయి వైన్ షాపు నుంచి ఒక్కో స్టేషన్‌కు రూ.8 వేలు, సర్కిల్‌కు రూ.10 వేలు, పట్టణంలో ఉండే వైన్‌షాపు నుంచి స్టేషన్‌కు రూ.12 వేలు, ఇలా ముడుపులు గతంలో వచ్చేవి. స్టేషన్ పరిదిలో రెండు, మూడు వైన్‌షాపులు ఉంటే సుమారు రూ.30వేల దాకా ఆదాయం వస్తుంది. ఇక బెల్టుషాపులు ఉంటే ఆదాయం అదనం. ఒక్కో బెల్టు షాపునకు రూ.2 వేల నుంచి రూ.3 వేల దాకా వసూలు చేస్తారు. మరో పక్క ఇసుక నుంచి కూడా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇలా ఎవరికి వారు లెక్కలు వేసుకుంటూ పోస్టింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని ప్రాంతంలో మట్కా, పేకాట విచ్చలవిడిగా ఉంటుండటంతో అక్కడా కూడా భారీగా డిమాండ్ ఏర్పడింది. నంద్యాల జిల్లాలో ఓ పెద్దాయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించే ఆ నియోజకవర్గానికి ఓ డీఎస్పీ ముందుగానే తన పోస్టును ఖరారు చేసుకున్నారు. దీంతో సదరు డీఎస్పీ తాను సూచించే సీఐలు, ఎస్‌ఐలకు పోస్టులు దక్కే అవకాశం ఉంది. తన టీంలో పని చేసే సీఐలు, ఎస్‌ఐలు ఆయనే దగ్గర ఉండి పెద్దాయనకు సిఫారసు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం ఆ అధికారి భారీ ఎత్తున ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. తన శిష్యులుగా ఉంటున్న కొంత మంది సీఐల పేర్లను ఆళ్లగడ్డకు కూడా రెకమెండ్ చేసినట్లుగా తెలిసింది. మరో పక్క కర్నూలు-నంద్యాల హైవే పరిధిలో ఓ సర్కిల్‌లో పని చేసిన సీఐ బనగానపల్లె ప్రాంతానికి పోటీ పడుతుండటం, ఆ పోస్టింగ్‌కు రూ.15 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో కొంత మంది సీఐలు విస్తుపోతున్నారు. అదే సీఐ ఆ పెద్దాయన ప్రాతినిధ్యం వహించే కేంద్రానికి పోస్టింగ్ ఇప్పిస్తే అదనంగా చెల్లించుకుంటానని చెప్పినట్లు సమాచారం. మరో పక్క నంద్యాల జిల్లాలో వైసీపీ హయాంలో పని చేసిన ఇద్దరు సీఐలు ఓ చోటా వైసీపీ నాయకుని మధ్య వచ్చిన విభేదాలతో అక్కడి నుంచి బదిలీ అయి ఓ మంత్రి నియోజకవర్గానికి వెళ్లారు. ప్రస్తుతం ఆ ఇద్దరు సీఐలు తిరిగి సొంత గూటికి చేరుకునేందుకు మార్గం సులువైంది. వైసీపీలో పని చేసినా ఆ చోటా వైసీపీ నాయకునితో ఉన్న విభేదాలే టీడీపీలో పోస్టింగ్‌లు దక్కేలా చేశాయి.



చంద్రబాబు చొరవతోనే కేంద్ర బడ్జెట్‌లో నిధులు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 26: రాయలసీమ వెనుకబాటుతనాన్ని మోదీకి వివరించి నిధులు రాబట్టడంలో సీఎం చంద్రబాబు సఫలీకృతులయ్యారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల నాగేంద్రలతో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో సీమ జిల్లాలోని వలసలు, కరువులు నివారించేందుకు సీఎం. చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమన్నారు. సీఎంగా చంద్రబాబు తనకున్న అనుభవంతో ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌ను గుర్తించి ప్రత్యేక నిధులను కేటాయించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గతంలో కూడా సీఎంగా జిల్లాకు విత్తనశుద్ధి, సోలార్ హబ్, ఎయిర్ పోర్టు, ఉర్దూ, క్లస్టర్ లాంటి విశ్వవిద్యాయాలాంటివి ఎన్నో అమలుకు నోచుకున్నాయన్నారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, కర్నూలు జిల్లాలో చెరువులు, కుంటలు, వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూసి కల్తీ విత్తనాలు, ఎరువులపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్రం రామకృష్ణుడు, నాయకులు పోతురాజు రవికుమార్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు లేని గ్రామాలను గుర్తించండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు(కలెక్టరేట్), జూలై 26: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్డు లేని గ్రామాలను గుర్తించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో రోడ్ల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు కి.మీ లోపు అప్రోచ్ రోడ్డు వేయని గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. ఆర్అండ్‌బీ కింద గుంతలు ఉన్న 39 రోడ్లకు మరమ్మతులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పథకాల కింద చేయాల్సిన పనులను ఐడెంటిఫై చేసి వెంటనే ప్రతిపాదనలు పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూములు ఆక్రమించిన వైసీపీ నాయకులు

- మాధవాంజనేయ స్వామికి చెందిన 70 ఎకరాల్లో వ్యాపారం
- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, జూలై 26: వైసీపీ ప్రభుత్వ హయాంలో పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో రూ. కోట్ల విలువైన దేవుడి భూములు అక్రమణకు గురయ్యాయని ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ దృష్టికి ఆమె వైసీపీ నాయకుల భూ ఆక్రమణలను తీసికెళ్లారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ మాధవ ఆంజనేయస్వామికి దాదాపు 188 ఎకరాలు భూమి ఉండగా రూ. కోట్ల విలువైన 70 ఎకరాలు వైసీపీ నాయకులు ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. అలాగే ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామికి చెందిన భూముల్లోని మట్టిని వైసీపీ నాయకులు అమ్ముకుని వ్యాపారం చేశారని తెలిపారు. దీని వల్ల ఆ భూములు ఎందుకూ పనికి రాకుండా పోయాయన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్‌ల నిధులను దోచుకున్నారని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని స్పీకర్ ద్వారా మంత్రికి విన్నవించారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గౌరుచరిత సభను కోరారు.

డీఎస్సీ కోచింగ్‌కు 451 దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం నిరుద్యోగుల నుంచి 451 దరఖాస్తులు వచ్చినట్లు డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఇందులో ఎస్‌జీటీ అభ్యర్థులు 326 మంది, స్కూల్ అసిస్టెంట్లు 125 మంది ఉన్నారని అన్నారు. 200 మందికి ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఇందులో ఎస్‌జీటీలకు ఎంత మంది, స్కూల్ అసిస్టెంట్లు సబ్జెక్టుల వారిగా ఎంత మందికి శిక్షణ ఇవ్వాలన్నది క్లారిటీ వచ్చిన తర్వాత శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఉప్పొంగిన తుంగభద్ర

పొంగి పొర్లుతున్న ఆర్డీఎస్ ఆనకట్ట



అగసనూరు సమీపంలో ఆర్డీఎస్ ఆనకట్టపై పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర వరద

కోసిగి, జూలై 26: తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరగడంతో సుమారు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టపై వరద నీరు చేరింది. శుక్రవారం వరద నీటి ప్రవాహంతో తుంగభద్ర నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెద్ద ఎత్తున వరద నీరు పొంగి పొర్లుతుండటంతో నదీతీర ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోసిగి తహసీల్దార్ పి. మురళి హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఆర్డీఎస్ ఆనకట్టపై సుమారు 3 అడుగుల మేర వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోసిగి మండల పరిధిలోని కడిదొడ్డి, కందుకూరు, సాతనూరు, అగసనూరు తుమ్మిగనూరు, లక్ష్మీనగర్ క్యాంప్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద నీరు గంట గంటకు పెరుగుతుండటంతో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో దండోరా వేసి హెచ్చరికలు జారీ చేశారు. వరద నీటితో గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులి కనుమ రిజర్వాయర్, చెరువులకు నీటిని నింపాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మంత్రాలయం, జూలై 26: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర పరవళ్లు శుక్రవారం మంత్రాలయాన్ని తాకాయి. వరద నీరు రావడంతో పుష్కరఘాట్ల వద్ద భక్తులు సందడి చేశారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీలు మైకుల ద్వారా భక్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, ఎస్ఐ గోపినాథ్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో నది తీరంలో బందోబస్తు నిర్వహిస్తూ ముందస్తు చర్యలుగా గజ ఈతగాళ్లను, అరిగెళ్లను సిద్ధం చేశారు.



తుంగభద్ర ప్రవాహాన్ని తిలకిస్తున్న భక్తులు, గ్రామస్థులు, పర్యాటకులు

తుంగభద్రనదికి పోటెత్తిన వరద



నది ఒడ్డున ఉన్న వ్యవసాయపు మోటార్లను తొలగిస్తున్న రైతులు

కౌతాళం, జూలై 26: తుంగభద్ర నది నిండుకుండలా ప్రవహిస్తున్నది. నదీతీరంలో ఉన్న మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామ రైతులు నది ఒడ్డున ఉంచిన వ్యవసాయపు విద్యుత్ మోటార్లను తొలగించారు. వాటిని ఒడ్డుకు చేర్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. నదిచాగి గ్రామ రైతులు విద్యుత్ పైపులు, మోటార్లను నది ఒడ్డు నుంచి బయటకు తీసేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడాల్సి వచ్చింది.

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూలై 26: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై 40 గంటల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. 40 గంటల పాటు మధ్యవర్తిత్వంపై తమిళనాడుకు చెందిన ఇద్దరు రిసోర్స్‌పర్సన్స్ రత్నతార, శశిదేవి న్యాయవాదులకు వివరించారు. కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు న్యాయవాదులకు వీరు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన న్యాయవాదులు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకట శేషాద్రి కూడా పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపికకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ శుక్రవారం తెలిపారు. సీనియర్ మోస్ట్ స్కూల్ అసిస్టెంట్లు లేకుంటే సీనియర్ మోస్ట్ పీఈటీ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి మూడు నెలల్లోపు పదోన్నతి వచ్చే అవ కాశం ఉన్న వారికి ఎంపికకు ప్రాధాన్యత లేదన్నారు. ఒకసారి స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేసిన వారు ఆరు సంవత్సరాలు పూర్తయ్యే వరకు అవకాశం ఉండదన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు పూర్తి సర్వీసు వివరాలతో సంబంధిత ధ్రువపత్రాలను 29వ తేదీలోపు డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోనెగండ్ల, జూలై 26: గోనెగండ్ల గ్రామ శివార్లలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గంజహళ్లి గ్రామానికి చెందిన మధుసూదన్(42) మృతి చెందాడు. మధుసూదన్ గంజహళ్లి నుంచి గురువారం సాయంత్రం ఎమ్మిగనూరుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున గోనెగండ్లలోని వీవర్స్ కాలనీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పత్తికొండ టౌన్, జూలై 26: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు క్షణికావేశంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం పత్తికొండ పట్టణంలో జరిగింది. పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయ సమీపంలో నరేష్ (35) తన భార్యా పిల్లలతో నివాసముంటున్నాడు. ఈయన పూలు, పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో భార్యా భర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో భార్య లలిత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతునికి నలుగురు పిల్లలు ఉన్నారు. ఇంట్లో పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ విషయంపై సీఐ మురళీమోహన్‌ను వివరణ కోరగా.. ఆత్మహత్యకు సంబంధించిన ఫిర్యాదు రాలేదని తెలిపారు.

యజ్ఞంలా పింఛన్ల పంపిణీ చేయాలి

జిల్లా ప్రాజెక్టు అధికారి ఉమాదేవి



విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి

మద్దికెర, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల పంపిణీని అధికారులు, సిబ్బంది ఒక యజ్ఞంలా నిర్వహించాలని జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి, మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఇందులో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీ జరుగుతుందని, అధికారులందరూ సమర్థవంతంగా పని చేయాలన్నారు. సిబ్బంది కొరత ఏదైనా ఉంటే.. ఇతర శాఖల అధికారులను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి పింఛన్లు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని బైలు ప్రాంతంలో సాగు చేయడానికి ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలమ్మ, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఏపీవో నర్సిరెడ్డి, ఏవో ఉప్పర రవి, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఎంఈవో రంగస్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉయ్యాలవాడ, జూలై 26: మండలంలోని పెద్దయమ్మనూరు - సర్వాయిపల్లె గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరి బ్రహ్మయ్య(70) అనే వృద్ధుడు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. శుక్రవారం మృతుడు బ్రహ్మయ్య తన సొంత గ్రామం కాకరవాడ నుంచి నంద్యాల పట్టణానికి వెళ్తుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి ప్రొద్దుటూరు పట్టణానికి వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బ్రహ్మయ్య మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బ్రహ్మయ్య తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఫీ తెలిపారు.

మేయర్‌పై కార్పొరేటర్ల ఫైర్

● రసాభాసగా వైసీపీ కార్పొరేటర్ల సమావేశం ● స్టాండింగ్ కమిటీలో అధి నాయకత్వం సూచించిన వారికే ఓటు

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వైసీపీలో చిచ్చురేపాయి. శుక్రవారం నగర శివారులోని ఓ హోటల్‌లో మూడు నియోజకవర్గాల కార్పొరేటర్లతో మేయర్ బీవై రామయ్య. జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి అంతర్గత సమావేశం నిర్వహించారు. వైసీపీ అధి నాయకత్వం సూచించిన ఐదుగురు కార్పొరేటర్లకు మాత్రమే ఓటు వేయాలని అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ సూచించారు. ఇందులో కర్నూలు నియోజకవర్గం నుంచి క్రాంతి కుమార్, యూనుస్, జుబైర్, పాణ్యం నుంచి మిద్దె చిట్టెమ్మ, కోడుమూరు నుంచి విక్రమసింహారెడ్డికి మాత్రమే ఓటు వేయాలని ఆదేశించారు. ఇంతలో టీడీపీ కండువాలు కప్పుకున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని కార్పొరేటర్లు మేయర్‌ను నిలదీశారు. 49వ వార్డు కార్పొరేటర్ మాట్లాడుతూ సీక్రెట్ పద్ధతిలో జరిగే ఎన్నికల్లో ఏ కార్పొరేటర్ ఎవరికి ఓటు వేసేదీ మీరెలా తెలుసుకుంటారని, వారి మీద ఎలా చర్య తీసుకుంటారని మేయర్‌ను ప్రశ్నించారు. ఖంగుతున్న మేయర్ వెంటనే మైక్‌ను కాటసానికి ఇచ్చేసారు.

● తాజాగా జరిగిన సర్వసభ్య సమావేశం చివరిలో ఇంకా తాను మాట్లాడుతుండగానే మేయర్ లేచి సభ ముగిసిందని చెప్పి వెళ్లిపోవడం ఏమిటని 4వ వార్డు కార్పొరేటర్ అర్షియా పర్వీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 7వ వార్డు కార్పొరేటర్ జుబేర్ మాట్లాడుతూ కమిషనర్ బదిలీ ఉందని తెలుసుకున్న కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆయనను మచ్చిక చేసుకుని రాత్రికి రాత్రి వారిని బదిలీ చేయడం ఏమిటని మేయర్‌ను ప్రశ్నించారు. కనీసం వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్ తమకు నగర పాలక కార్యాలయం నుంచి రాలేదని మేయర్‌కు చెప్పారు.



మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేటర్లు

● కాటసాని మాట్లాడుతూ ప్రతి సర్వసభ్య సమావేశం జరిగే మూడు రోజులు ముందు ఎందుకు వైసీపీ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయడం లేదని మేయర్‌ను దండించారు. ఇకపై మనవాళ్లతో మూడు రోజులు ముందు సమావేశం ఏర్పాటు చేసి, వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కాటసాని మేయర్‌ను ఆదేశించారు. మొన్న జరిగిన సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పదే పదే తనపైన విమర్శ చేసినప్పుడు, గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు జరిగాయని మాట్లాడుతున్నప్పుడు ఎందుకు ఆమెను అడ్డుకోలేదని మేయర్‌ను ప్రశ్నించారు.

● కార్పొరేషన్‌లో ఏం జరుగుతోందో తెలిసినా మేయర్ తమకు ఎందుకు చెప్పడం లేదని కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతిసారీ మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినా ఆయన తీరు మారకపోవడం విడ్డూరంగా ఉందని కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు.

చిరస్మరణీయుడు బీవీ

నేడు మాజీ మంత్రి మోహన్‌రెడ్డి 12వ వర్ధంతి



ఎమ్మిగనూరు, జూలై 26: మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు ప్రజలకేగాక రాష్ట్ర ప్రజలకు చిరస్మరణీయుడు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ప్రియ శిష్యుడిగా పేరు పొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1984లో ఎన్టీఆర్ సూచనలతో రాజకీయ అరంగ్రేటం చేసి ఎమ్మిగనూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి దాదాపు 30ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు మం త్రిగా పనిచేసి ఎమ్మిగనూరు నియోజకవర్గ రూపురేఖలను మార్చిన మహనీయుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మిగనూరుకు ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత బీవీకే దక్కింది. ఉమ్మడి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు రహదారులు, ఎన్టీఆర్ గృహాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలను ఏడు ప్రాం తాల్లో ఏర్పాటు చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి రైతుల గుండెల్లో అపర భగీరథుడిగా నిలిచిపోయారు. ఎమ్మిగనూరు పురపాలక సంఘం రూపురేఖలు మార్చి రాష్ట్రంలోనే గ్రేడ్-1 మున్సిపాల్టీగా తీర్చిదిద్దిన ఘనత బీవీకే దక్కింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో శాంతిభద్రతలకు పెద్దపీట వేసి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించారు.

తండ్రి బాటలో తనయుడు


అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి తనయుడు జయనాగేశ్వరరెడ్డి తండ్రి బాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా నిలుస్తున్నారు. తండ్రి చూపిన బాటలో నడుస్తూ ఎమ్మిగనూరు ప్రజలతో మమేకమై ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గానికి గుర్తింపు తీసుకువచ్చారు. ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచి చరిత్ర సృష్టించారు.

ఆటోను లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

శిరివెళ్ల, జూలై 26 : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన నాగేంద్ర(35) తన ఆటోలో వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్‌ను గ్రామాల్లోని దుకాణాలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో పని ముగించుకుని జాతీయ రహదారిపై నంద్యాల వైపు వెళ్తుండగా శిరివెళ్ల మెట్ట వద్ద ఆటోను లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అందులోని మరో వ్యక్తి రాముడు గాయాలపాలయ్యాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వెల్లడించారు.

విద్యుత్ బిల్లు చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించండి

కర్నూలు టౌన్ డివిజన్ అధికారులకు ఎస్ఈ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, జూలై 26: విద్యుత్ బిల్లు చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఉమ్మడి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. శుక్రవారం కర్నూలు టౌన్ డివిజన్ అధికారులతో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని, మెయింటెనెన్స్ బాగుండాలని అన్నారు. వినియోగదారులు ఇది వరకు ప్రైవేట్ యాప్‌లలో కరెంట్ బిల్లు చెల్లించేవారని, ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ యాప్‌లో నమోదై బిల్లు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ వారిగా అధికారులు చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని అన్నారు.

కార్గిల్ అమరవీరుల త్యాగాలను మరువలేం

కాగడాల ప్రదర్శనలో గౌరు



కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా చెన్నమ్మ సర్కిల్‌లో కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, జూలై 26: దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణలర్పించిన కార్గిల్ అమరవీరుల త్యాగాలను మరువలేమని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నమ్మ సర్కిల్‌లో టీడీపీ కూటమి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా అమరవీరులను స్మరించుకుంటూ చేపట్టిన కాగడాల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యంతో పోరాడి భారతదేశ ప్రజల ప్రాణాలను కాపాడిన సైనికులకు సెల్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎస్వీ రామకృష్ణ, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, పాణ్యం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, రవిప్రకాష్‌రెడ్డి, పోలిరెడ్డి, బీజేపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, వీరప్ప పాల్గొన్నారు.

బైక్‌లో ఉంచిన రూ.4 లక్షల నగదు అపహరణ

బేతంచెర్ల, జూలై 26: బైక్‌లో ఉంచిన రూ.4 లక్షల నగదును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బేతంచెర్ల పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన లారీ యజమాని నాగేష్ తన పొలాన్ని అమ్ముకోగా రూ.4 లక్షలు వచ్చాయి. ఆ మొత్తాన్ని బైకులో ఉంచుకుని బేతంచెర్ల పాత బస్టాండులో స్వీట్లు కొనుగోలు చేసేందుకు ఆగాడు. దుకాణంలో స్వీట్లు కొనుక్కొని వచ్చేలోగా బైకులో ఉంచిన రూ.4 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో నాగేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రేషన్ బియ్యం సీజ్

నంద్యాల క్రైం, జూలై 26: నంద్యాల జిల్లాలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం తెలిపారు. జిల్లాలోని బనగానపల్లె సర్కిల్ పరిధిలోని నందివర్గం సబ్ ఇన్స్పెక్టర్ పి.తిరుపాలుకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం బనగానపల్లె మండలం చెరువుపల్లె సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బొలెరో వాహనంలో 23 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అయితే డ్రైవర్ మధు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. మరో ఘటనలో శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నందూరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి స్థలంలో పీడీఎస్ రైస్ ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్సై సురేష్ తన సిబ్బందితో దాడులు చేశారు. అక్కడ 178 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఎస్పీని కలిసిన ఏపీ ఎన్జీవోలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 26: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్ర వారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్‌ను ఎన్జీవోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా వెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎస్పీ కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కోడుమూరు తాలుకా కార్యదర్శి వలి, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, కర్నూలు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యవర్గం రామకృష్ణారెడ్డి, బలరామిరెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, సాంబశివారెడ్డి, మధు, చిరంజీవి, సుభాషిణి, వరలక్ష్మి, మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశా లల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 5వ తేదీ చివరి గడువు అన్నారు. మండల విద్యా శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో దరఖాస్తుల పరిశీలన తర్వాత ఆగస్టు 17న వాటిని రాష్ట్ర కార్యాలయానికి పంపుతామన్నారు. ఉత్తమ ఉపాధ్యా య అవార్డుతోపాటు నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ అవార్డుకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 15 సంవత్సరాల రెగ్యులర్ సర్వీసు పూర్తి చేసిన వారు అర్హులన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: విద్యారంగంలో నెలకొన్న సమ స్యలు పరిష్కరించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు. జీవో 117తో విద్యారంగం అస్తవ్యస్తమైందని, ఈ జీవోను రద్దు చేసి 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని, మినిమమ్ టైమ్ స్కేల్స్ ఉపాధ్యాయ పదవి విరమణ వయస్సు 62 ఏళ్లగా పెంచాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 26: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 రాజేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీ.క్యాంప్ సెక్షన్ పరిధిలో కాలనీలలో కరెంట్ కోత ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతు పనులు జరగని ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

తిరుపతిలో టీజీవీ కళాకారులకు సత్కారం

కర్నూలు(కల్చరల్), జూలై 26: అభినయ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో భాగంగా శుక్రవారం రాత్రి కర్నూలుకు చెందిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమల పాలిక నాటకం ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య, రచయిత పల్లెటి కులశేఖర్‌లతోపాటు కళాకారులను అభినయ అధ్యక్షులు బీఎన్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు.

లారీ యజమానులు మొండి వైఖరి వీడాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: డోన్ పట్టణంలో లారీ యజమానులు డ్రైవర్ల జీతాల విషయంపై మొండి వైఖరి వీడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ అన్నారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ రెండు సంవత్సరాలకు ఒక్కసారి డ్రైవర్లకు జీతాలు పెంచాలని అగ్రిమెంట్ చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో కుటుంబం గడవాలంటే నెలకు రూ.30 వేలు ఖర్చు అవుతుందన్నారు. యజమా నులు ఇప్పుడు ఇస్తున్న జీతాలు సరిపోకపోవడంతోనే జీతాలు పెంచాలని డ్రైవర్లు అడుగుతున్నారన్నారు.

మెనూ పాటించని వంట ఏజెన్సీలను రద్దు చేస్తాం

సి.బెళగల్, జూలై 26: ప్రభుత్వ పాఠశాలలో మెనూ పాటించని వంట ఏజెన్సీలను రద్దు చేస్తామని ఎంఈవో ఆదాంబాషా హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలుకదొడ్డి, సంగాల గ్రామాల్లోని ఉన్నత పాఠశాల, ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో నే ఉండాలన్నారు. ఆయనన వెంట ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

నదీ తీర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్, జూలై 26: నదీ తీర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ సుకుమార్ సూచించారు. శుక్రవారం తిమ్మనదొడ్డి మొదలుకొని కొత్తకోట వరకు నదితీరంలో ఉన్న విద్యుత్ మోటార్లకు కరెంట్ సరఫరా నిలిపేస్తామని అన్నారు. తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రామాల్లోని రైతులు నది దగ్గరకు వెళ్లరాదని సూచించారు. ఏఈ వెంట లైన్‌మెన్‌లు ఉన్నారు.

మందుబాబులకు రెండు రోజుల జైలు శిక్ష

కర్నూలు, జూలై 26: నగరంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మంది మందుబాబులకు రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా.. కోర్టు జైలు శిక్ష విధించింది.

కర్నూలు సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్

కల్లూరు, జూలై 26: కర్నూలు సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కర్నూలు పరిధిలోని జోహరాపురం 154 సర్వే నెంబరులోని వక్ఫ్‌బోర్డు భూమిలో రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బుడంఖాన్ మసీదుకు చెందిన భూమిని రియల్టరుకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పీజీ ఎస్ కళ్యాణి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 26: నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని డీఎంహెచ్‌వో వైప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని పాతబస్టాండు సమీపంలోని చిదంబరావు సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ పరిధిలోని గృహాలను సందర్శించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని అన్ని గృహాలులోని నీటి తొట్టీలు, కూలర్లు, ఫ్రిడ్జి, టైర్లు, పాత బాటిళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. జిల్లా కమ్యూనిటీ మొబైలైజర్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

● బుధవారపేటలో: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత శుక్రవారం బుధవారపేటలోని 15వ వార్డులో నిర్వహి స్తు న్న డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

వీర సైనికుల త్యాగాన్ని స్మరించుకుందాం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: దేశం కోసం పోరాడి అమరులైన వీరసైనికుల త్యాగాలను భారతీయులంతా స్మరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. శుక్రవారం 48వ వార్డులోని రోజా వీధిలో కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా అమర వీర సైనికులా త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నాగన్న, రాముడు, ఖాదర్, శేషమ్మ, లలిత, కరెమ్మ పాల్గొన్నారు.



కర్నూలులో వీర సైనికులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మీసాల సుమలత తదితరులు



కోడుమూరులో..

కర్నూలు(అర్బన్): నగరంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టారు. ర్యాలీని ప్రిన్సిపాల్ ఇంది రా శాంతి జెండా ఊపీ ప్రారంభిం చారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు అమర జవాన్లకు నివాళి అర్పించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఆర్ కామ్లినాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు ఠాగూర్ విద్యా నికేతన్ విద్యార్థులు నివాళి అర్పించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం యుద్ధంలో అమరులైన జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మురళి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారతదేశ భూభాగం కోసం మన జవా న్లు పాకిస్తాన్ జవాన్లతో పోరాడి విజయం సాధించారన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు మునీంద్రా, ఉమర్, అజయ్, పద్మా, చెన్నకేశ్వరి, శిరీష, కీర్తన పాల్గొన్నారు.

గర్భిణి అడ్మిషన్‌లో నిర్లక్ష్యంపై విచారణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 26: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో ఓ నిండు గర్భిణి అడ్మిషన్‌లో నిర్లక్ష్యంపై శుక్రవారం ధన్వంతరీ హాలులో నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. దేవనకొండకు చెందిన శశికళ అనే గర్భిణి అడ్మిషన్ విషయంలో వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో ఆమె కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) విచారణకు ఆదేశించింది. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, మెడిసిన్ హెచ్‌వోడీ డా.ఇక్బాల్ హుశేన్‌లు శుక్రవారం విచారణ చేపట్టారు. అనంతరం గైనిక్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలతో కలిసి గర్భిణి ఓపీ టికెట్ చించి వేయడం, అడ్మిషన్ చేయడంలో ఆలస్యంపై విచారించారు. గర్భిణి తల్లితో మాట్లాడగా ఉదయం వచ్చినా ఆసుపత్రిలో చేర్చుకోకుండా వైద్యులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని, సాయంత్రం అవుతున్నా స్పందించకపోవడంతో తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గైనిక్‌తో పాటు ఇతర అత్యవసర వార్డులకు వచ్చే రోగుల పట్ల మర్యాదగా మాట్లాడాలని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడే బాధ్యత వైద్యులదేనని, ఆ విషయం మరిచి ప్రవర్తించ వద్దని సూచించారు. సమావేశంలో గైనిక్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రొఫెసర్ సావిత్రి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.

మురుగు నీరు నిలిస్తే దోమపోటు తప్పదు

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: ఇండ్ల పరిసరాలలో మురుగునీరు నిలిస్తే దోమపోటుకు గురికావాల్సి వస్తుందని నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. శుక్రవారం నగర వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి సచివాలయ కార్యదర్శుల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. రామలింగేశ్వర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందు వల్ల ఇండ్ల వద్ద పాత టైర్లు, బాటిళ్లు, కుండీలు, గచ్చు వంటి వాటిల్లో నీటి నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, కార్యదర్శులు ఉన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 26: ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విజయవాడ నుంచి ఇసుక ఆపరేషన్స్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ (ఎక్సైజ్)శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఆరు నుంచి 8 నెలలకు ఇసుకను సరఫరా చేసేలా ప్లాన్ చేయడం తోపాటు ప్రస్తుతం భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్తగా ఇసుక రీచ్‌లను గుర్తించాలన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి వాహన యజమానులు ఎక్కువ ధర వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులతో మాట్లా డుతూ జిల్లా స్థాయి ఇసుక కమిటీలోని అధికారులందరూ ప్రతి వారం ఇసుక రీచ్‌లను పరిశీలించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సెబ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విశ్వభారతిలో హెపటైటిస్ దినం

కర్నూలు(హాస్పిటల్), జూలై 26: ప్రపంచ హెపటైటిస్ దినం సందర్భంగా విశ్వభారతి పెంచికలపాడులోని మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును శుక్రవారం కాలేజీ చైర్మన్ డా.డి.కాంతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి ప్రమాదకరమైనదని, ఇది శరీరంలోని కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునీరుద్దీన్ అహ్మద్, డా.నాగిరెడ్డి, కళాశాల, నర్సింగ్, పారా మెడికల్ ఫిజియోథెరపి సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా నుంచి ఎంపికైన కార్యకర్తలు మూడు రోజుల పాటు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యే కీలకం: డీఎస్పీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: విద్యార్థుల జీవితంలో ఇంటర్ విద్యనే కీలకమని కర్నూలు డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఉచి తంగా సరఫరా చేసిన నోట్స్, బ్యాగులు, పుస్తకాలను డీఎస్పీ మహ బూబ్ బాషా, డీవీఈవో పరమేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఒకేషనల్, బీ.క్యాంపు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు నాగస్వామి నాయక్, షీలా సౌజన్య, అధ్యాపకులు ప్రసన్నకుమార్, పద్మావతి, విజయశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగస్వామి మృతి టీడీపీకి తీరని లోటు: గౌరు



రంగస్వామి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, జూలై 26: టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ రంగస్వామి మృతి టీడీపీకి తీరని లోటు అని నందికొట్కూరు పార్టీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం రంగస్వామి గుండెపో టుతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన అంత్యక్రియలకు గౌరు వెంకటరెడ్డి హాజరై భౌతిక కాయానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. రంగస్వామి భార్య రామాంజనమ్మ, కొడుకులు, రాజు, రామాం జనేయులు, కుమార్తె లక్ష్మీదేవిలను ఆయన ఓదార్చారు. పార్టీ వీరి కుటుం బానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రపెద్దస్వామి, రామచంద్రుడు, అయ్య స్వామి, నాగమల్లేష్, విజయుడు, ఖాజామియా పాల్గొన్నారు.

పంటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

కోడుమూరు(రూరల్), జూలై 26: మండలంలోని వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో కొర్ర, సజ్జ, కంది పంటలను వ్యవసాయాధికారి రవిప్రకాష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో దోమ కనిపిస్తే అసిఫేట్, వేపనూనె తగిన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. కొర్ర, సజ్జ, కంది పంటలకు ఎటువంటి పిచికారీ అవసరం లేదన్నారు. ఆముదంలో పచ్చపురుగు నివారణకు అసిఫేట్, క్వినాల్ ఫాస్‌లను జిగురు మందుతో కలిపి పిచికారని చేయాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది కౌలుట్ల, రాజేష్ ప్రదీప్ ఉన్నారు.

ఉమ్మడి వనరుల అభివృద్ధే లక్ష్యం

ఓర్వకల్లు, జూలై 26: మండలంలోని ఉమ్మడి వనరులను అభివృద్ధే తమ లక్ష్యమని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. ఓర్వకల్లులో శుక్రవారం రచ్చకట్ట వద్ద ఎస్ఏఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఐటీసీ ఆధ్వర్యంలో సామాజిక వనరులకై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో మల్లేశ్వరి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీవో కుమార సాయినాథ్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినే టర్లు దయాకర్, క్రాంతి, రంగారెడ్డి, విశ్వేశ్వర్, నరేష్, వాసు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 26: జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపులు, డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యుడు కే భాస్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందించారు. పర్మిషన్ లేకుండా ఫర్టిలైజర్ షాపులు బహిరంగంగా నడుపుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మహేంద్రబాబు, రాంబాబు, రమణ, దామోదర్ పాల్గొన్నారు.

శిఖామణి సేవలు చిరస్మరణీయం

టీడీపీ నాయకుడు మణిబాబు

కర్నూలు(రూరల్), జూలై 26: దివంగత కోడుమూరు మాజీ ఎమ్మెల్యే ఎం.శిఖామణి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన తనయులు టీడీపీ నాయకుడు మణిబాబు, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ అన్నారు. కర్నూలు అర్బన్ మండలంలోని మునగాలపాడులో శుక్రవారం శిఖామణి 16వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు ఘనం గా నిర్వహించారు. ఈసందర్భంగా శిఖామణి భార్య రేపల్లె సత్యమ్మ కు మారులు మణిబాబు, మణిగాంధీ కలిసి గ్రామ శివారులో ఉన్న శిఖా మణి ఘాట్ వద్ద ఆయన సమాధికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20ఏళ్ల కోడుమూరు ఎమ్మెల్యేగా నిస్వార్థంగా పనిచేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. నివాళి అర్పించిన వారిలో కోడుమూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, శిఖామణి కుటుంబ సభ్యులు వంశీమోహన, సుశీల, నిర్మల, ప్రణీత్, ఉదయ్, భార్గవ్‌గాంధీ, దిలీప్‌గాంధీ, సంవేద్, రహేలమ్మ, సరోజినిదేవి, యేసేపు, కస్తూరి బాయి, సుమలత ఉన్నారు.



శిఖామణికి నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అనుమతి లేకుండా టవర్లు ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తాం

ఓర్వకల్లు, జూలై 26: రైతుల అనుమతి లేకుండా వారి సాగు భూముల్లో టవర్లు ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తామని బాధిత రైతులు శుక్రవారం తహసీల్దార్ నటరాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా హైటెన్షన్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మండలంలోని గుట్టపాడు, తిప్పాయపల్లె, ఓర్వకల్లు, హుశేనాపురం గ్రామాల్లో రైతుల అనుమతులు లేకుండా నష్టపరిహారం ఇవ్వకుండా టవర్లు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హైటెన్షన్ టవర్ల వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, సన్న, చిన్నకారు రైతులకు సారవంతమైన ఈ భూములే జీవనాధారం అన్నారు. ఈ టవర్ల చుట్టూ 20 నుంచి 30 సెంట్ల దాకా ఎలాంటి పంట పండదన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బాకర్ బాషా, షేక్షావలి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెంచికలపాడులో తాగునీటి కొళాయిలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

గూడూరు, జూలై 26: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ సునిల్ కన్నా అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఎంపీడీవో విజయసింహారెడ్డితో కలిసి స్పెషల్ డ్రైవ్ కింద గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామాన్ని సందర్శించి శానిటేషన్, తాగునీటి సరఫరాపై చర్చించారు. అనంతరం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకులు, డ్రైనేజీ కాలువలు, నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. ప్రజలకు సీజ నల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఆధార్ కేంద్రాలను సక్రమంగా నడపాలి

సి.బెళగల్, జూలై 26: ఆధార్ కేంద్రాలను సక్రమంగా నడుపాలని ప్రత్యేక అధికారి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలకల్లు, సిబెళగల్‌లోని ఆధార్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శకుంతల, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గుండమ్మ కుటుంబానికి న్యాయం చేయండి

కర్నూలు(అర్బన్), జూలై 26: గుండమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మూలింటి మారెప్ప కోరారు. శుక్రవారం ఢిల్లీలోని జాతీయ కమిషన్ సభ్యులు వాడ్డేపల్లి రామ చంద్రను కలిసి వినతి ప్రతం అందజేశారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసేన నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జనసేన నాయ కులు పీబీవీ సుబ్బయ్య మర్యాదపూర్వకంగా శుక్రవారం విజయవాడలో కలిసి అభినందనలు తెలియజేశారు. కర్నూలు జిల్లాను టూరిజం ప్రాం తాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు.

మానసిక వికలాంగులకు ఫిజియోథెరపీ ముఖ్యం

సి.బెళగల్, జూలై 26: ఫిజియోథెరపీ మానసిక వికలాంగులకు ముఖ్యమైన వైద్యమని ఫిజియోథెరపి అధికారి రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమ్యారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మానసిక వికలాంగుల కోసం శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్య, ఫిజియోథెరపీ డాక్టర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎంఈవో జ్యోతి, ఎంపీడీవో శకుంతల, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

పెండింగ్ జీతాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ 7 నెలల నుంచి జీతాలు రాకపోవడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఆటోలకు డ్రైవర్లను ఏర్పాటు చేసి అగ్రిమెంట్ ప్రకా రం రూ.18,500 జీతం, ఈఎస్ఐ, పీఎఫ్, కార్మిక చట్టాలు అమలు చేస్తా మని మోసం చేసిందన్నారు. గతంలో కార్మికులు పోరాటం ఫలితంగా కమిషనర్ కొంత పెండింగ్ జీతాలు చెల్లించారన్నారు. అనంతరం మెడి కల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ నాయకుడు దూదెకొండ కుమార్ అబ్దుల్ దేశాయ్, విజయ, రామాంజనేయులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి: ఎస్ఐ

కోడుమూరు, జూలై 26: ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతోపాటు గురువులను గౌరవించాలని ఎస్ఐ బాల నరసింహులు అన్నారు. కేవీఆర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల స్వాగతోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ విద్యార్థులు కష్టపడి చదివి అనుకొన్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రులకు పేరు తీసుకరావాలని అన్నారు. ఇటీవల ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రవితేజ, ప్రియాంకకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు గోట్ల శేఖర్, రవిబాబు, విజయ్‌కుమార్, బాలస్వామి, వీరేష్, నాగరాజు, జడ్పీ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తైమూన్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

కేతవరం రోడ్డును నిర్మించాలి: సీపీఎం

ఓర్వకల్లు, జూలై 26: కేతవరం-గార్గేయపురం రోడ్డును నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కేతవరంలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు వేయాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న, శాఖ కార్యదర్శి శ్రీధర్ హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ కేతవరం నుంచి నిత్యం ప్రయా ణికులు, విద్యార్థులు జిల్లా కేంద్రానికి వెళ్తుంటారని, 4 కి.మీలు మేర ఉన్న ఈ రోడ్డు దాటుకుని వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రంగస్వామి, వెంకటస్వామి, నాగరాజు, రాముడు, మధుసూదన్‌బాబు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరు, జూలై 26: విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు నిర్ణీత ధరలకంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జిల్లా స్క్వాడ్ అధికారులు మోహన్ విజయ్ కుమార్, ఖాద్రీలు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కిరణ్ హైబ్రీడ్ సీడ్స్, భువనేశ్వరి ఏజెన్సీస్, శ్రీలక్ష్మి ఏజెన్సీస్, న్యూ గణేష్ హైబ్రీడ్ సీడ్స్ దుకాణాల్లో ఏవోలు మహేశ్వరరెడ్డి, మునెమ్మలతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి ఏజన్సీస్‌లో రూ. 12,960 విలువ చేసే టమోట విత్తనాల అమ్మకాలు నిలుపుదలకు ఆదేశించారు. అలాగే శ్రీలక్ష్మి ఏజన్సీస్‌లో రూ. 54,145 విలువ చేసే మిరప విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేస్తు ఆదేశాలు ఇచ్చారు. ఈ దుకాణ దారులు తనిఖీల సమయంలో విత్తన కంపెనీలకు సంబందించిన సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్స్ అధికారులకు చూపించకపోవటంతో అమ్మకాలు నిలుపుదల చేస్తు ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు లోబడి విక్రయాలు చేయాలని, కాలం చెల్లిన మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా కార్గిల్ విజయ దివస్ ర్యాలీ

పత్తికొండ టౌన్, జూలై 26: పత్తికొండలో శుక్రవారం కార్గిల్ విజయ దివస్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్, మాజీ సైనికులు నరసింహులు, విజయ్, టీడీపీ నాయకులు ముత్యాల తిరుపాలు, సుధాకర్, బ్రహ్మయ్య, శంకరయ్య, మల్లికార్జున, కరణం నరేష్, రామలింగయ్య, వీహెచ్‌పీ నాయకులు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలో కార్గిల్ విజయ దినోత్సవ ర్యాలీని మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్‌లు కళ్యాణి, గౌతమ్, ఏవో శారద, పీడీ ఈరన్న ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

తుగ్గలి, జూలై 26: జొన్నగిరిలో ఉన్న ప్రధాన ప్రజల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, సర్పంచ్ ఓబులేసు, సంగాల కృష్ణ కోరారు. శుక్రవారం అమరావతిలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలరాముడు, సోము, మీషాల శేకర్, జయరాముడు, అంజి, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ డిజిటల్ లైబ్రరీని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ రెడ్డి కోరారు. శుక్రవారం విద్యార్థులకు ఈ లైబ్రరీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు యుగంధర్ రెడ్డి, లైబ్రేరియన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ వేలం వాయిదా

ఆలూరు, జూలై 26: ఆలూరు పట్టణంలోని సంత మార్కెట్లో 6 ఏళ్ల క్రితం నిర్మించిన 27 దుకాణాలకు వేలం పాటలు ఈనెల 27న నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు నిర్ణయించడంతో చిరు వ్యాపారులు డిపాజిట్‌లు చెల్లించారు. వేలం పాటలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవో ప్రకాష్ నాయుడు శుక్రవారం తెలిపారు.

వేదవతికి నిధులు ఇవ్వండి

● సీఎం చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి నిమ్మలను కోరిన వీరభద్రగౌడ్

ఆలూరు, జూలై 26: వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడును, ఇరిగేషన్ మంత్రి నిమ్మలను కలిసి విన్నవించారు. అలాగే ఆలూరులో జింకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు వీరభద్ర గౌడ్ తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నెమకల్ రవి ఉన్నారు.


సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న టీడీపీ నేత వీరభద్ర గౌడ్

కొత్త కార్యాలయానికి రికార్డుల తరలింపు

దేవనకొండ, జూలై 26 : మండలంలోని రెవెన్యూ రికార్డులను పాత కార్యాలయం నుంచి ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి తరలించారు. గతంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సమీపంలో ఉన్న ఎంపీడీవో అదనపు గదులలోకి ఎనిమిది నెలల కిందట రెవెన్యూ కార్యాలయాని తరలించారు. నాటి నుంచి నేటి వరకు భూముల రికార్డులు పాత భవనంలోనే ఉండేవి. తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి తమ సిబ్బందితో ప్రతి రికార్డు కొత్త భవనంలోకి తరలించి భద్రపరిచారు.

మండల ఇన్‌చార్జి ఎంపీపీగా ఎర్ర నాగప్ప

తుగ్గలి, జూలై 26: తుగ్గలి మండల ఎంపీపీ హనుమరాజు ఆదెమ్మ రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో తుగ్గలి మండల ఎంపీపీగా ఎర్ర నాగప్ప బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎంపీడీవో నూతన ఇన్‌చార్జి ఎంపీపీని పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, రాంబ్రహ్మం, టీఏలు ప్రదీప్, నాయకులు తేరప్ప పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా మిద్దె రంగయ్య

వెల్దుర్తి, జూలై, 26: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ఇన్‌చార్జీ ఎంపీపీగా మిద్దె రంగయ్యను నియమించినట్లు ఎంపీడీవో శివశంకరప్ప తెలిపారు. ఎంపీపీకి ఎన్నిక నిర్వహించే వరకు మిద్దె రంగయ్య పదవిలో కొనసాగుతారన్నారు. ఈయన గోవర్ధనగిరి ఎంపీటీసీగా ఎన్నికై వైఎస్ ఎంపీపీ-1 కొనసాగుతున్న విషయం పాఠకులకు విదితమే. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ రవిరెడ్డి, సర్పంచి శైలజ, జడ్పీటీసీ సుంకన్న, ఎల్లస్వామి, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు ఎరువులు తరలిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం

మంత్రాలయం, జూలై 26: ఆంధ్ర నుంచి కర్ణాటకకు ఎరువులను తరలిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఏవో జీర గణేష్ హెచ్చరించారు. శుక్రవారం కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక చెక్‌పోస్టు వద్ద కర్ణాటకకు వెళ్లే ఆటోలు, లారీలు, టెంపో వాహనాలను తనిఖీ చేశారు. వ్యవసాయ సిబ్బంది, మార్కెట్ అధికారులను అప్రమత్తం చేశారు. మాధవరంలోని దుకాణాలను తనిఖీ చేసి ఎవరు కూడా కర్ణాటకకు ఎరువులను తరలించవద్దని ఆదేశించారు. ఈ తనిఖీల్లో వీఏఏలు సువర్ణమ్మ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు మార్చారు... న్యాయం చేయాలి..

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

హొళగుంద, జూలై 26: రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చారని హొళగుంద, ముగమానుగుంది గ్రామానికి చెందిన చంద్రశేఖర్ మంజునాథ్, పత్తికొండ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, వీరేష్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ హొళగుందకు చెందిన సర్వేనెంబర్ 424-ఏ, 1.97 ఎకరాల విస్తర్ణం పెద్దల నుండి సంక్రమించిందని అన్నారు. అలాంటి భూమిని అధికారులు ఇతరులకు ఆన్‌లైన్ చేశారాని వాపోయారు. అలాగే ముగుమానుగుంది గ్రామానికి చెందిన 101/ఏ సంబంధించిన 4.20 సెంట్ల భూమిలో కొందరు అన్యాయంగా సాగు చేస్తున్నారని తెలిపారు. తమ పూర్వికులకు చెందిన భూమిని రికార్డులు మార్చి ఇతరులకు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్ఐ దినేజ్ కుమార్‌ను వివరణ కోరగా రికార్డులు ప్రకారం ఆన్‌లైన్ చేశామని, పూర్వీకుల పొలం అంటున్న వారి వద్ద 50 ఏళ్ల క్రితం ఆర్ఎచ్ రికార్డ్ తప్ప, ఇతర డాక్యుమెంట్లు ఏవీ లేవన్నారు. వారి వద్ద ఏవైనా డాక్యుమెంట్లు ఉంటే తీసుకురావాలని సూచించారు.

మొక్కలు నాటండి

ఆలూరు, జూలై 26: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సునీల్‌కుమార్, ఇన్‌చార్జి డీఎల్‌పీవో ప్రకాష్ నాయుడు అన్నారు. శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో వారు మొక్కలు నాటారు. ఆయన వెంట ఏజీఎం త్రినాథ్ రెడ్డి, ఆలూరు మేనేజర్ రవికుమార్, పాల్గొన్నారు.

31న స్పాట్ అడ్మిషన్లు

ఆలూరు, జూలై 26: ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 31న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నప రెడ్డి శుక్రవారం తెలిపారు.. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలు రాయకపోయినా స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావచ్చు అన్నారు.

మంత్రాలయంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

మంత్రాలయం, జూలై 26: మంత్రాలయంలో బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌పీవీఎఫ్) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులతో కలిసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా, కృష్ణలు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో బాలికల హాస్టల్ లేకపోవడం సిగ్గు చేటని అన్నారు. అధికారులు స్పందించి బాలిక హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌పీవీఎఫ్ నాయకులు మోహన్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌పీవీఎఫ్ నాయకులు

కనిపించని సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

ఆదోని రూరల్, జూలై 26 : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలు కనపడడం లేదు. సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలను కార్యాలయాల్లో పెట్టాలని ప్రభుత్వ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసినా ఆదోని రూరల్ పరిధితోపాటు అర్బన్‌లో ఎక్కడ పెట్టలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో కనపించని సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

సీజ్ చేసిన రూంను తెరిచిన అధికారులు

పత్తికొండ, జూలై 26: పత్తికొండ యశోద పాఠశాలలో గత కొద్దిరోజుల క్రితం సీజ్‌చేసిన పాఠశాల స్టోర్ రూం తలుపులు శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు తిమ్మారెడ్డి, రమేష్ ఆధ్వర్యంలో తెరిచారు. యశోద గార్డెన్‌పాఠశాల పేరుతో అనుమతులు ఉన్న పాఠశాలను శ్రీచైతన్యపేరిట నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఈనెల 11న ఎంఈవోలు పాఠశాలలో తనిఖీలు చేసి స్టోర్ రూంను సీజ్ చేశారు. సీజ్ చేసిన రూంతలుపులు తెరిచి అందులో ఏమున్నాయో పరిశీలించి నివేదికలు పంపాలని శుక్రవారం డీఈవో ఆదేశాలుజారీ చేశారు. సాయంత్రం ఎంఈవోలు, పాఠశాల సిబ్బంది సమక్షంలో రూం తలుపులు తెరిపించారు. అందులో కేవలం విద్యార్థులకు అందించేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉండడంతో ఆ విషయాన్నే డీఈవోకు నివేదిక పంపుతామని ఎంఈవో తిమ్మారెడ్డి విలేకర్లకు తెలిపారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 26: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విశ్వనారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌వో డివిజన్ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ప్రధాన రహదారిపై విద్యార్థి సంఘ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్తి విద్యా సంవత్సరానికి అధ్యాపకులను నియమించకుండా, కేవలం నవంబర్ వరకు మాత్రమే బోధన కోసం నియమించుకోవడం అన్యాయమన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులతో విచారణ చేసుకొని, గుర్తింపు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణవేణి, నికిత, అశోక్, గోవిందు, బసవ, ప్రవీణ్, నవీన్ కుమార్, అజయ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, జూలై 26: ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ 47వ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్లీనరీ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు అగ్గి రాముడు, ప్రమోద్, మోహన్, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

రూ.1.24 కోట్లు మంజూరు

ఆదోని టౌన్, జూలై 26: పట్టణంలో కొత్తగా విస్తరించిన ప్రాంతాలలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.ఒక కోటి 24 లక్షలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే డా. పార్థసారథి తెలిపారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసి కొత్తగా విస్తరించిన ప్రాంతాల ప్రజలకు కాలువలు, రోడ్లు, పైపు లైనుల సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించానన్నారు. స్పందించిన మంత్రి రూ. ఒక కోటి 24 లక్షలను మంజూరు చేశారని తెలిపారు.

గోనెగండ్లకు చేరిన ఎల్లెల్సీ నీరు

గోనెగండ్ల, జూలై 26: గోనెగండ్ల సెక్షన్‌కు ఎల్లెల్సీనీరు శుక్రవారం మధ్యాహ్నం చేరాయి. ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్లకు 130 క్యూసెక్కుల నీరు చేరినట్లు ఎల్లెల్సీ ఏఈ ఉదయ్‌భాస్కర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. గోనెగండ్లకు చేరిన నీటిని గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు, నీటి కుంటలకు విడుదల చేశారు. మిగిలిన నీటిని మొత్తం కోడుమూరుకు మళ్లించారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

నందవరం, జూలై 26: మండలంలో నిర్మాణంలో ఉన్న నాడు- నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు వినతిపత్రాన్ని తహసీల్దార్ ఓబులేసుకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవని నిబంధనలు పాటించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నితిష్, రత్నం, విజయ్ పాల్గొన్నారు.

'దోపిడీని అరికట్టాలి'

కౌతాళం, జూలై 26: మీసేవా కేంద్రంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ ఇమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కౌతాళంలో రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక రేట్లతో రైతులకు పాసుపుస్తకాలు, అడంగల్, భూరికార్డులకు సంబంధించిన నకలు తీసుకోవాలంటే ప్రభుత్వం సూచించిన ధరల కంటే ఎక్కువ ఫీజుతో వసులు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో రైతు కూలీ సంఘం నాయకులు ఉలిగప్ప, యంకప్పలు ఉన్నారు.

నీటిని వృథా చేయకండి

మద్దికెర, జూలై 26: మండంలోని బురుజుల గ్రామంలో బోర్లలో క్లోరైడ్ ఎక్కువగా ఉన్నందు వల్ల నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని సర్పంచ్ పద్మావతి, కార్యదర్శి హరికృష్ణ అన్నారు. శుక్రవారం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రంగస్వామి ఉన్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, జూలై 26: జిల్లాలో ఉన్న గిరిజన సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమ్లా నాయక్, రాముా నాయక్‌లు కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బందూనాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో నడపాలి

మద్దికెర, జూలై 26: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సకాలంలో నడపాలని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, జూలై 26: పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటరులో పని చేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టి కంటయ్య, రంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఉద్యోగుల కాంట్రాక్టుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు కృష్ణయ్య, అధ్యక్షుడిగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా కర్రెన్న, గురుస్వామి, కళావతి, ప్రధాన కార్యదర్శిగా దేవయ్య, సహాయ కార్యదర్శులుగా కేశన్న, నరేష్, సురేష్, కోశాదికారిగా రోజాలను ఎన్నుకున్నారు.

నీటి సరఫరా పైపులైన్‌లో క్లోరినేషన్

మద్దికెర, జూలై 26: మద్దికెరలోని సాయినగర్, రామ్‌నగర్ ప్రాంతాల ప్రజలకు పంచాయతీ వారు సరఫరా చేసే నీటి పైపులైన్లు కలుషితం కాకుండా ఇన్‌లైన్ క్లోరినేషన్ మందును సరఫరా చేశామని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, సర్పంచ్ బండారు సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. శుక్రవారం ఆ ప్రాంతాలకు నీరు సరఫరా అయ్యే పైపులైన్‌లో క్లోరినేషన్ మందులను వేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్ర, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, జూలై 26: పత్తికొండ నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా టీడీపీ తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి అన్నారు. శుక్రవారం అమరావతిలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

సమస్యలు పట్టించుకోరా?

మంత్రాలయం, జూలై 26: మంత్రాలయంలోని బీసీ హాస్టల్ సమస్యలను పట్టించుకునే వారే లేరా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి థోమస్ ఆరోపించారు. శుక్రవారం బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరినా కూడా వాటికి మరమ్మతులు చేయడం లేదని, హాస్టల్స్‌కు అవసరమైన వంట మనిషి, కామాటి, వాచ్‌మెన్ ట్యూటర్లు లేరన్నారు. ఇన్‌చార్జి వార్డెన్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, రాజు, వీరేష్, రాము, పాపయ్య పాల్గొన్నారు.

కేవీకేలు రైతులకు మరింత చేరువ కావాలి

ఎమ్మిగనూరు, జూలై 26: కృషివిజ్ఞాన కేంద్రాలు రైతులకు మరింత చేరువకావాని కేవీకే కో-ఆర్డినేటర్ డా. రాఘవేంద్ర చౌదరి అన్నారు. శుక్రవారం బనవాసి కేవీకేలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. యాగంటి కేవీకే నుంచి వచ్చిన స్వర్ణోత్సవ జ్యోతిని స్థానిక కో-ఆర్డినేటర్ డా. రఘువేంద్ర చౌదరి అందుకున్నారు. రైతులు కేవీకేల ద్వారా పంటలలో యాజమాన్య పద్ధతులను, సస్యరక్షణ గురించి తెలుసుకొని సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. నిరంజన్ రెడ్డి, డా. మౌనిక, ఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూలై 26: ఎమ్మిగనూరులో ఎలాంటి అనుమతులు లేకుండా, సెంటర్లలో మౌలిక వసతులు లేకుండా డీఎస్సీ, టటీటీసీ, నవోదయ, గురుకుల ఎంపికలకు శిక్షణలు ఇస్తున్నారని, ఆ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది, ఆర్‌యూఎస్ఎఫ్ నాయకులు రఘునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈవో-2 మధుసుదన్‌రాజుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అధికారుల సూచనలు తప్పనిసరి

ఆదోని రూరల్, జూలై 26 : రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అరుణకుమారి తెలిపార. శుక్రవారం ఏడీఏ అర్బీఏఓ అశోక్ కుమార్‌రెడ్డిలతో కలిసి శాస్త్రవేత్తలు నాగలాపురంలో పర్యటించి కొర్ర, వేరుశెనగ పంటలను పరిశీలించారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, జూలై 26 : ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన ఈడిగ శంకరయ్యను పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం తన నివాసంలో ముద్దాయి శంకరయ్య కారు అమ్ముతుండగా, అదుపులో తీసుకొని అతని వద్ద నుంచి 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ పీరయ్య తెలిపారు.

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలి

ఆస్పరి, జూలై 26: ఆలూరు నియోజకవర్గంలోని వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలోని వేదావతి రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో హనుమంతు, మల్లేష్, రామంజినేయులు, రంగస్వామి, మధుసూదన్ రెడ్డి, మసాలా రవి, సుందర్ రాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

హొళగుంద, జూలై 26: హొళగుందలో గ్రామంలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆదోని డీఎల్పీవో నూర్జహాన్ శుక్రవారం అన్నారు. ఈబీసీ కాలనీలో పారిశుధ్యం పనులను ఎంపీడీవో ఆజాద్, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్, పంచాయతీ ఈవో రాజశేఖర్‌తో పాటు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధుల ప్రబలకుండా ప్రజలకు పారిశుధ్యంపై, వైద్యసిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రంగస్వామి, మహమ్మద్ షఫీ, నాగరాజు ఉన్నారు.